# విధివిలాసాలు

★



రచన: అమ్మాజీ ఋషి(శ్రీ)కోరా.

గోపాల్ మనసులో భవిష్యత్తును గురించి ఎన్నెన్నో ఆలోచనలు చోటు చేసుకున్నాయి. కానీ వాటికి పరిష్కారమంటూ దొరకలేదు. ప్రొద్దుపోయినందున పార్కులో జనం పలుచబడుతున్నారు. ఇక ఆ రోజు ఆలోచనలకు స్వస్తిచెప్పి వాచీ చూచాడు గోపాల్. ఎనిమిది కావస్తూంది. ఆలోచనలతో బుర్ర వేడెక్కటవలన విపరీతంగా తలనొప్పి వచ్చింది గోపాల్‌కు. ఒకసారి జేబులోనికి చెయ్యి పోనిచ్చాడు. చేతికి కొంత చిల్లర తగిలింది. స్ట్రీట్ లైట్ దగ్గరికెళ్ళి లెక్కపెట్టాడు. రెండు పావలా బిళ్ళలు, పదిపైసల బిళ్ళ ఒకటీ ఉన్నాయి. సరిపోతాయన్న సంతృప్తితో మెడికల్ షాపువైపు నడిచి పావలా చెల్లించి ఒక టాబ్లెట్ తీసుకొని తిన్నగా రంగయ్య టీ స్టాల్ దగ్గరకు వెళ్ళాడు. టీ త్రాగి ప్రక్కనే వున్న బడ్డీకొట్టులో సిగరెట్టు కొని వెలిగించుకొని ఇంటికి బయలుదేరాడు.

గోపాల్ బి.ఏ. పాస్ అయ్యి రెండు సంవత్సరాలు అయ్యింది. అనేక అప్లికేషన్లు పెట్టాడు, ఇంటర్వ్యూలకు వెళ్ళాడు. కాని ఉద్యోగం మాత్రం రాలేదు. అప్లికేషన్లు, ఇంటర్వ్యూలకు ఐదువందల రూపాయిలు అప్పుకూడా అయ్యింది. వాళ్ళకు ఉత్తరమో, దక్షిణమో కావాలి. మార్కులు, కాండక్టుతో వారికి పనిలేదు. ఉద్యోగానికి ఎవరెక్కువ దక్షిణ ఇచ్చుకుంటారో వారికి ఆ ఉద్యోగం దక్కుతుంది. చివరకు ప్యూను ఉద్యోగానికి కూడా రెండువేలు కావాలిట. ఉద్యోగాల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నారు. కానీ తనలాంటి నిరుద్యోగులు కొంతమంది ఉంటారన్న నిజం తెలిసికొని కొంత వరకు కుదుటపడ్డాడు.

క్లబ్బు దగ్గరకు వచ్చేసరికి తమ్ముడు నరేంద్ర జ్ఞప్తికి వచ్చాడు. నరేంద్ర కోసం అతని కళ్ళు క్లబ్బు అంతా వెదికాయి. ఎక్కడా కనిపించలేదు. ఎవరినో అడిగాడు. నరేంద్ర, అతని స్నేహితులు రెండవ ఆటకు వెళ్ళారనీ చెప్పారు. వాచీ చూశాడు. 9 గం॥ అయ్యింది. తమ్ముడు జులాయిలా తిరుగుతాడు. అతనికి లేని దురలవాటంటూ లేదు, వాడు ఇంటి విషయాలేవీ పట్టించుకోడు. తన తండ్రి ఈ సంవత్సరము రిటైర్ అయ్యారు. వచ్చే పెన్షనుతో వారము రోజులు కూడా గడవదు. తను ఉదయం ట్యూషన్లు చెప్పటం ద్వారా ఒక వందరూపాయలు వస్తాయి. కుటుంబం జరగటం చాలా కష్టంగా వుంది. ఇంకా పెండ్లి కావలసిన చెల్లెలుంది. ఆలోచించి ఆలోచించి గోపాల్ బుర్ర వేడెక్కింది, మెల్లగా ఇల్లు చేరాడు.

వరండాలో తండ్రి పడక కుర్చీలో పడుకొని పురాణం చదువుకొంటున్నారు. "ఏరా! నరేంద్ర కనబడ్డాడా?" "లేదునాన్నా! నేను క్లబ్బువైపు వెళ్ళలేదు" అని అబద్ధం చెప్పాడు

ఎల్లప్పుడూ......
టి. ఎన్. హెజ్. వారి
* షైనిక్స్ * ఆర్. ఓ.
కలర్ బనియన్లనే
ఉపయోగించండి.
ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

గోపాల్. "అమ్మా! అందరి భోజనాలు అయినాయా?" అడిగాడు గోపాల్.

"ఆ! గీతా, నీవూ ఉన్నారు," అన్నది ఆమె. అప్పటిదాకా చదువుకుంటూన్న గీత స్నానానికి నీళ్ళుతోడి అన్నయ్యను పిలిచింది. "త్వరగా చేసిరారా, భోజనం వడ్డిస్తాను," అంటూ వంటింట్లోకి వెళ్ళింది పార్వతమ్మ.

"అన్నయ్యా! రేపు టరమ్ ఫీజు కట్టకపోతే క్లాసుకు అటెండ్ కానివ్వరట" విని ఊరుకున్నాడు గోపాల్. భోజనం చేస్తుండగా "రేపు ఫీజు కట్టాలటరా" అన్నది పార్వతమ్మ. "ఎంత గీతా" అడిగాడు గోపాల్. అరవై రూపాయలూ, ఒక రూపాయి పైనూ మొత్తం అరవై ఒకటి అన్నయ్యా. "సరేనమ్మా. రేపు మధ్యాహ్నం కడుదువులే" అన్నాడు గోపాల్.

అంతా పడుకున్నారు. పార్వతమ్మమాత్రం గుమ్మంలో కూర్చొనివుంది. గోడ గడియారం పదకొండు కొట్టింది. "ఒరే గోపాలూ! నరేంద్ర ఇంకా రాలేదురా! అలా క్లబ్బువైపు వెళ్ళి చూసిరారా" అంది పార్వతమ్మ. "అమ్మా వాడు సినిమాకు వెళ్ళాడు, ఇంకా రెండు గంటలకుగానీ రాడు" అన్నాడు గోపాల్. "అయితే ఇందాక క్లబ్బుకు వెళ్లే వచ్చావన్నమాట" అన్నది గీత. అవునమ్మా! క్లబ్బుకు వెళ్ళాను. ఎవరో చెప్పారు సినిమాకు వెళ్ళాడని. నాన్నగారు బాధపడతారని అబద్ధం చెప్పాను అన్నాడు గోపాల్ బాధగా.

ముగ్గురూ నరేంద్ర గురించి ఆలోచిస్తూ నిద్రాదేవి వడిలోకి జారుకున్నారు.

ఉదయం టిఫిన్ చేస్తుండగా "ఏరా! నరేంద్రా! నువ్వు చదువుకోకుండా జులాయిలా క్లబ్బులో తిరుగుతున్నావు. నీకు డబ్బెక్కడిదిరా! జేబులు కొడుతున్నావా ఏమిటి?" అని అడిగాడు గోపాల్. ఆ పని వచ్చినా నిక్షేపంలా బ్రతికేవాడ్ని. డబ్బులు మీరివ్వకపోయినా నా స్నేహితులు ఇస్తారు. అయినా నా విషయంలో జోక్యం కలిగించుకోవద్దని నీ కెన్ని సార్లు చెప్పాను అని విసురుగా వెళ్ళాడు నరేంద్ర.

టిఫిన్ చేశాననిపించి మోహాను దగ్గరికెళ్ళాడు గోపాల్. "ఏరా! బహుకాలదర్శనం ఊరకరారు మహానుభావులు" అంటూ కుర్చీ చూపించాడు. "నిజంగానే అవసరముండి వచ్చానురా!" ఏమిటని ప్రశ్నించాడు మోహాన్. డబ్బు కావాలిరా? "డబ్బా! ఎంత?" వంద చాలు. "ఓస్ అంతేగదా! లక్షలు అడుగుతున్నట్లు బాధపడ్తావేరా! అలాగే, నీ కెంత కావాలంటే అంత అడుగు ఇస్తాను" అన్నాడు స్నేహపూర్వకంగా.

డబ్బు తీసుకొని ఇంటికి వచ్చాడు. చెల్లెలికి డబ్బయి రూపాయలిచ్చి ఫీజు కట్టగా మిగిలినవి "నువ్వుంచుకోమ్మా!" అని ఇంట్లోకి కావలసిన సరుకులు అడిగాడు తల్లిని. సాయంత్రం నాల్గు గంటలయ్యింది. మనసు కాహ్లాదం కలగటానికి అలా పార్కుకి బయలుదేరాడు. ఆ రోజు శని వారం పార్కులో జనం బాగా ఉన్నారు.

అందరిలోనూ ఆనందాలు వెల్లివిరుస్తుంటే గోపాల్ మనసులో మాత్రం అగ్నిజ్వాలలు.

ఇంతలో దొంగ, దొంగ పట్టుకోండి, పర్సు కాజేసిపోతున్నాడు అని అరుస్తున్నా రెవరో పార్కు ఎదురుగా. దొంగ వెంట చాలామంది పెరుగెడుతున్నారు. రాళ్ళు విసురుతున్నారు. జానెడు పొట్టకోసం ఏ మార్గంలేక వాడు దొంగగా మారుంటాడు. పాపం! అతనికి డబ్బు లెంత అవసరమై ఉంటాయో? అని ఆలోచిస్తుండగా ఎవరో అన్నారు, ఆ దొంగ లారీ క్రింద పడి చనిపోయాడని. గోపాల్ హృదయం కరిగి పోయింది.

గోపాల్ ఇంటికి బయలుదేరాడు. దారిలో ఆ దొంగ శవం దగ్గర జనం గుంపుగా మూగారు. గోపాల్ కెందుకో అతనిని చూడాలనిపించింది. చనిపోయినతని జేబులోని డైరీ తీసి ఎవరో చదువుతున్నారు. పేరు నరేంద్ర అట, ఇల్లు ఇన్సీస్ పేటలోనట అని. గోపాల్‌కు మూర్ఛవచ్చినంత పని అయ్యింది. కోలుకొని పోలీసులు రాకముందే టాక్సీని పిలిచి ఇంటికి తీసుకెళ్ళాడు. అంతా గొల్లుమన్నారు. అంత్య క్రియలు జరిగాయి.

వారం రోజుల తరువాత నరేంద్రుకు అప్పిచ్చిన వాళ్ళు అందరూ ప్రత్యక్షమయ్యారు. ఇచ్చినవీ, ఇవ్వనివీ మొత్తం ఆరువందల యాబది రూపాయలయ్యాయి. మోహన్ అందరికీ డబ్బు లిచ్చి పంపాడు. గోపాల్‌కు జీవించుట అనవసర మనిపించింది. వెంటనే పెన్, పేపరు తీసి ''నేను చనిపోవటానికి కారణం నేనొక నిరుద్యోగిని ఇందుకు కారకులు ఎవ్వరూ లేరు'' అని వ్రాసి మరల చదివి మడతవేసి టేబుల్‌పై పెట్టాడు.

వెళ్ళబోయే ముందు అందరినీ ఒకసారి చూడాలనుకొన్నాడు. వంటింట్లో పనిచేసుకుంటున్న తల్లిని 'వంట ఇంకా కాలేదా' అని పలకరించి, ఏదో వ్రాసుకుంటున్న గీతను 'ఏమ్మా కాలేజీ టైమయినట్లుందని పలకరించి, వరండాలో కుర్చీలో పడుకొని కూనిరాగాలు తీస్తున్న తండ్రివైపు తృప్తిగా చూసి, ధనసహాయం చేసిన మోహన్‌కు మనసులో కృతజ్ఞతలతో అడుగు ముందుకు వేయబోయాడు.

ఎదురుగా ఓ కవరుతో పోస్ట్‌మాన్ ప్రత్యక్షమైనాడు. కవరు చించిన గోపాల్‌కు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు. అవి అపాయింట్‌మెంట్ ఆర్డర్స్.

---

# ★ వృత్తి ★

రచన : ''వాహిని''

మెత్తగా కళ్ళు తెరచింది రత్తాలు. అంతా చీకటి.

వళ్ళంతా పుండులాగుంది. ప్రక్కన చూసింది ఎవరూ లేదు. 'ఈ సచ్చినోళ్ళంతా యింతే! వాళ్ళ ఆకలి తీర్చుకున్న తర్వాత ఎంగిలి విస్తారాకులా వదిలేసి వెళ్తారు. బట్టలు సర్దుకుంది. చూట్టూ చూసింది ఎవ రయినా వస్తున్నారేమోనని. దూరంనుండి ఎవరో వస్తు న్నట్లు కన్పించింది.

ఫర్లాంగు దూరానగల తాయారు టీ కొట్టువైపు దారి తీసింది, కాలికేదో ఆ చీకట్లో మెత్తగా తగిలినట్లునిపించింది. ఒళ్ళు జల్లుమంది 'పామేమో...' మళ్ళీ అనుమానం వచ్చింది రత్తాలుకు 'వస్తువులా అనిపించిందే' బాగా చూసింది. ఆ చీకట్లో వెలసిన నల్లని గుడ్డకు చిన్న క్రొత్త నల్లగుడ్డ మాసిక వేసినట్లుగా చిన్న వస్తువు కన్పించింది. 'భయంలేదు వస్తువే' చేతితో అందుకుంది. అది మనీపర్స్ చైను విప్పింది. ఒక పది రూపాయల నోటు, మరో ఐదు రూపాయల నోటు వున్నట్లు తెలుసుకుంది.

మురిసిపోయింది.

అభిమానం అడ్డుపడింది.

''అయ్యోపాపం అతను మర్చిపోయి వుంటాడు.దూరం నుండి వెళ్ళేవ్యక్తి అతనే తొందరగా వెళ్ళి యిచ్చేస్తే!